సాక్షి
బాపట్ల
శనివారం । 7 । జూన్ । 2025



ప్రసన్నాంజనేయుడికి అభిషేకాలు

ఫిరంగిపురం: వేమవరంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 21వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు.



క్యూఆర్ కోడ్ బోర్డులు ఏర్పాటు

విజయపురిసౌత్: పర్యాటక కేంద్రం నాగార్జున కొండలో క్యూ ఆర్ కోడ్ బోర్డులను ఏర్పాటు చేసినట్లు నాగార్జునకొండ కన్జర్వేటివ్ అసిస్టెంట్ వెంకటయ్య తెలిపారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: లాలాపేట శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. స్వామి వారిని పెళ్లి కుమారుడిగా, అమ్మవార్లను పెళ్లి కుమార్తెలుగా అలంకరించారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా మెగా డీఎస్సీ పరీక్షలు



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లాలో మెగా డీఎస్సీ- 2025 పరీక్షలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రం నరసరావుపేట పరిధిలో ఏర్పాటు చేసిన 5 కేంద్రాలకు తొలిరోజు 3 చోట్ల పరీక్ష నిర్వహించారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, ఎంఏఎం ఇంజినీరింగ్ కళాశాల, ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాలలో 460 మంది అభ్యర్థులకు 404 మంది హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఎంఏఎం ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాన్ని పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సిబ్బంది ఉన్నారు.

చివరి దశకు సాగర్ క్రస్ట్‌గేట్ల మరమ్మతులు


విజయపురి సౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్‌గేట్ల మరమ్మతులు పూర్తి కావచ్చాయి. సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 590 అడుగులు కాగా, 546 అడుగుల వద్ద నుంచి 26 రేడియల్ క్రస్ట్‌గేట్లు ఉంటాయి. రెండు, మూడు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి ట్రయల్‌రన్‌కు ప్రాజెక్టు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటివరకు గేట్లకు పట్టిన తుప్పు వదిలించటంతోపాటు క్రాక్‌లు, వెల్డింగ్ జాయింట్‌లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేస్తున్నారు. గత ఏడాది వరద నీరు అధికంగా వచ్చి పలు మార్లు ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో రబ్బర్ సీళ్లు బాగా దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో కొత్తవి మారుస్తున్నారు. గేట్లకు గ్రీజింగ్, ఆయిలింగ్ పనులు చేస్తున్నారు. విద్యుత్ సరఫరా అయ్యే ప్యానల్ బోర్డులు తనిఖీ చేస్తున్నారు. మరమ్మతులు పూర్తి కాగానే రేడియల్ క్రస్ట్‌గేట్లకు అధికారులు ట్రయల్ రన్ చేస్తారు.

జూలై 5న లోక్ అదాలత్



నరసరావుపేట టౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.ఆశీర్వాదం పాల్ అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని జూలై 5న నిర్వహించే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం



తాడేపల్లి రూరల్ : మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని మహానాడు 14వ రోడ్డులోని సంతాన వేణుగోపాల స్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమయ్య, బాలకోటయ్య, చిన్నయ్య, విజయ్, దొడ్డిపాటి వెంకటేశ్వరరావు, జానీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో యాదవ కార్పొరేషన్ చైర్మన్...
సంతాన వేణుగోపాలస్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహయాదవ్ పాల్గొన్నారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, భారత యాదవ సంఘం చైర్మన్ లాకా వెంగళరావు, యాదవ భక్తులు పాల్గొన్నారు.

ఇసుక తోడేళ్లు

సముద్రం ఉగ్రరూపం దాల్చి అలలు ఎగసి పడినప్పుడు ఇసుక దిబ్బలు వాటికి అడ్డుకట్ట వేస్తాయి. తీరప్రాంత గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాపాడుతాయి. అధికారం అండ చూసుకుని రెచ్చిపోతున్న ఇసుక మాఫియా దెబ్బకు ఇక్కడి దిబ్బలు కనుమరుగైపోతున్నాయి. దీంతో ఇక్కడి గ్రామాల ప్రజలకు పెను ముప్పు తప్పేలా లేదు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ప్రజలు వాపోతున్నారు.



విజయలక్ష్మీపురం గ్రామం వద్ద ఇసుక దిబ్బల నుంచి ఇసుక తరలించడంతో చదునుగా ఉన్న తీరం

- మాఫియా దెబ్బకు సముద్ర తీరంలో ఇసుక దిబ్బలు మాయం
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం మునిగిందని ఆరోపణలు
- తీర ప్రాంత గ్రామాల ప్రజలకు పొంచి ఉన్న పెను ముప్పు

చీరాల టౌన్: రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు ఇసుక దిబ్బలను యథేచ్ఛగా తోడేసుకుని భూముల్లో చదును చేసుకుంటున్నారు. చీరాల ప్రాంతంలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో మాఫియా చెలరేగిపోతోంది. ఒకవైపు ఇసుక దిబ్బలు, మరోవైపు తీరం అంచును యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. మండలంలోని గవినివారి పాలెం పంచాయతీ పరిధి విజయలక్ష్మీపురం తీర గ్రామాల్లో ఇలా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు.

అధికారమే అండగా..

విజయలక్ష్మీపురం గ్రామంలో సీ మౌత్‌ను మూసేసి గుంటూరుకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యే భర్త, రియల్ ఎస్టేట్ వ్యాపారి వేస్తున్న వెంచర్ చదునుకు, ఇతర వ్యాపార అవసరాలకు సముద్రపు ఇసుకను ట్రాక్టర్లు ద్వారా రవాణా చేస్తున్నారు. ఇసుక దిబ్బలు కనుమరగుతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల రూరల్ మండలానికి చెందిన తీర ప్రాంతం నుంచి కూడా సముద్రపు ఇసుకను తరలిస్తున్నారు.

కన్నెత్తి చూడని యంత్రాంగం

చట్టవిరుద్ధంగా రోజుకు రూ.లక్షల విలువైన ఇసుకను రవాణా చేస్తున్నప్పటికీ మాఫియా నుంచి మామూళ్లు తీసుకున్నందునే అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖాధికారుల తీరుపై అంతా మండిపడుతున్నారు. తీర ప్రాంత గ్రామాల ప్రజల క్షేమాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు.

అడ్డుకున్న గ్రామ ప్రజలు



సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరుతున్న గ్రామస్తులు

తీరానికి ముప్పు...

ఈ పరిణామాలతో తీరం ఒడ్డున ఉన్న గ్రామాలు పెనుప్రమాదంలో చిక్కుకున్నాయి. ప్రకృతి విపత్తులు సంభవిస్తే ప్రాణ నష్టం జరిగే అవకాశం కూడా ఉంది. సముద్రం ఉప్పొంగిన సమయంలో ఒడ్డున ఉన్న ఇసుక దిబ్బలే గ్రామాలను కాపాడుతాయి. కెరటాల ఉధృతిని తగ్గిస్తాయి. అలాంటి దిబ్బలు ప్రస్తుతం మాఫియా దెబ్బకు మాయం అయ్యాయి. ఇంకా ఇదే పరిస్థితి కొనసాగితే తీర ప్రాంత గ్రామాలతోపాటు పరిసర గ్రామాలు సైతం ముంపునకు గురై ప్రాణ, ఆస్తి నష్టాలకు అవకాశం ఉంటుంది.



తీరం వద్ద ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

తీరంలో ఇసుక దిబ్బలను యథేచ్ఛగా తవ్వుతుండటంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. కానీ మళ్లీ మాఫియా చెలరేగుతుండటంతో ఫలితం లేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీర ప్రాంతాన్ని పంచుకుని తింటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక లేకుంటే తీరప్రాంత గ్రామాల్లోని తాము చాలా నష్టపోతాయని చెబుతున్నారు. తమకు అండగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా మాఫియాకు అండగా నిలిచినట్లు ప్రవర్తిస్తున్నట్లు ఆరోపించారు.

మా పరిధిలోనిది కాదు

ఈ విషయమై చీరాల తహసీల్దార్ గోపికృష్ణను వివరణ అడుగగా.. బాపట్ల మండలంలోని అడవి పంచాయతీ తీరప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. వీఆర్వోను పంపించి వివరాలు సేకరించామని పేర్కొన్నారు. ఇది బాపట్ల తహసీల్దార్ పరిధిలోకి వస్తుందని వివరించారు.

– కె.గోపికృష్ణ, తహసీల్దార్

యోగాతో ఆరోగ్యం మెరుగు



బాపట్ల: యోగా వలన ఆరోగ్యం, మానసిక సమతుల్యత మెరుగు పడతాయని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. శుక్రవారం యోగాంధ్రలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో బాపట్ల మండలం నగరవనంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అత్యంత ప్రాచీనమైన భారతదేశంలో రూపొందించిన ప్రక్రియ అని తెలిపారు. దయనందిన జీవితంలో సాధన చేస్తే శరీరం ఆరోగ్యంగా, మానసిక స్థితి సమతుల్యతతో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.గంగాధర్ గౌడ్, డీఆర్‌డీఏ పి.డి. శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ బి.శ్రీనివాసరావు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, జిల్లా అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు గిడ్డంగుల పరిశీలన



పర్చూరు(చినగంజాం): పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఉన్న పొగాకు గిడ్డంగులను మార్క్‌ఫెడ్ ఎండీ మంజీర్ జిలానీ శుక్రవారం పరిశీలించారు. గిట్టుబాటు ధర లేక పేరుకుపోయిన నిల్వలను కొనే దిక్కులేని పరిస్థితిలో రైతులు ఆందోళన చేపట్టడంతో యంత్రాంగం స్పందించింది. పొగాకును ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసే ప్రయత్నంలో భాగంగా ఆయన యార్డును పరిశీలించారు. బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, పర్చూరు తహసీల్దార్ బ్రహ్మయ్య, అధికారులు, రైతు నాయకులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సత్యప్రసాద్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

మంత్రి అనగానికి కాలనీవాసుల వినతి

రేపల్లె: రేపల్లె పట్టణంలోని 18వ వార్డు అరుంధతీ నగర్ సమీపంలో ఏర్పడిన జగనన్న కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న కాలనీవాసులు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యలను విన్నవించారు. రహదారులు, డ్రెయిన్‌లు, తాగునీటి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం పడినా నివాస గృహాల మధ్య రోజుల తరబడి నీటి నిల్వలు ఉండటంతో దోమల బెడద, దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలతో విషసర్పాల బెడద అధికమైందని వివరించారు. అప్పులు చేసి గృహాలు నిర్మించుకున్నా కనీస వసతులు లేక ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వేసవి ప్రారంభమైనప్పటి నుంచి బోర్లు మరమ్మతుకు గురై తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. మున్సిపల్ అధికారులు మాత్రం స్పందించలేదన్నారు. సమస్యలపై పలుమార్లు అధికారులకు వినతిపత్రం అందించటం, కార్యాలయం వద్ద నిరసనలు తెలియజేసినా ఫలితం శూన్యమని గోడు వెళ్లబోసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి కావాల్సిన నిధులు కేటాయింపులు చేస్తామన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్, జగనన్న కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి.ధనమ్మ, కో కన్వీనర్ రవికుమార్, సహాయ కార్యదర్శి నాంచారమ్మ, సభ్యులు శ్రీనివాసరావు, వీరాంజనేయులు, గోపి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను విస్మరించిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ప్రకాశం జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి

యర్రంవారిపాలెం (కారంచేడు): ఈ ఏడాది పొగాకు సాగు చేసిన రైతులను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని వైఎస్సార్ సీపీ ప్రకాశం జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం యర్రంవారిపాలెంలో తనను కలిసేందుకు వచ్చిన స్థానిక పొగాకు రైతులు, విలేకరులతో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలతో పాటు సంతనూతలపాడు నియోజకవర్గంలో కొంత మేర బ్లాక్ బర్లీ, దొర పొగాకు సాగు చేశారన్నారు. ప్రస్తుతం పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పొగాకు సాగు చేసిన రైతుల్లో ఎక్కువ శాతం కౌలు రైతులేనన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

పొగాకు రైతుల పక్షాన పోరాడతానని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో అప్పటికప్పుడు ఆఘమేఘాల మీద మంత్రుల బృందం పర్యటించి పొగాకు కొనుగోలు చేస్తామని ప్రకటించిందని తెలిపారు. అయితే నెల అవుతున్నా ఇంత వరకు పొగాకు రైతుల కన్నీరు తుడవలేక పోయారన్నారు. 89 మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తే ఇప్పటికి కేవలం 25 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి పట్టీ పట్టనట్లు దోబూచులాడుతున్నారన్నారు. పొగాకు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడానని సీఎం చంద్రబాబు మాటల్లో నిజాయతీ లేదన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకొనేంత వరకు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా వెంటనే బర్లీని మొత్తం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. యర్రం లక్ష్మారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ పోలూరి శివారెడ్డి, భవనం రాజగోపాల్‌రెడ్డి, భవనం వెంకటేశ్వర్‌రెడ్డి, మనుబోతు వెంకటరెడ్డి, గుదిబండి అంజిరెడ్డి, పమ్మి వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ముఖ్యం

బాపట్ల: ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మండల వ్యవసాయాధికారులకు, ఉద్యాన శాఖ అధికారులకు మూడు రోజులపాటు కొనసాగిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో ప్రజలకు ప్రకృతి వ్యవసాయంపై దశలవారీగా అవగాహన కల్పించాలని సూచించారు. చిన్న, సన్నకారు, కౌలు రైతులకు అవగాహన పెంచాలని తెలిపారు. రసాయనిక ఎరువులు వాడకంతో అనర్థాలు వివరించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ మాట్లాడుతూ సేంద్రియ సాగుకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించాలన్నారు. పెరటి కూరగాయల పెంపకంపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం రాష్ట్రస్థాయి అధికారులు రామచంద్రం, భాగ్యలక్ష్మి, అడిషనల్ డీపీఎం మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

విశ్వాసానికి త్యాగానికి ప్రతీక

- మానవతా వెలుగుతో ఉదయించాలన్నదే అల్లాహ్ సందేశం
- బక్రీద్–శాంతి సందేశం, మానవతా దీప్తి



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం చిన్నారులు



యద్దనపూడి: పవిత్ర రంజాన్ పర్వదినం అనంతరం ముస్లింల జీవితాల్లో మరొక ఆధ్యాత్మిక సందడిని నింపే పండుగ బక్రీద్. 'బకర్' అంటే జంతువు, 'ఈద్' అంటే పండుగ– రెండింటి కలయికే బక్రీద్. ఇది ఖుర్బానీ (బలిదానం) పండుగ కూడా. అందుకే దీనిని 'ఈదుల్ ఖుర్బానీ' లేదా 'ఈద్ ఉల్ అదా'గా పిలుస్తారు. రంజాన్ తర్వాత 70 రోజులకు వచ్చే ఈ పండుగకు జిల్లాలోని ఈద్గాలు, మసీదులను మత పెద్దలు సిద్ధం చేశారు. శనివారం బక్రీద్ పండుగ జరుపుకోవాలని ప్రకటించారు. బక్రీద్ ముందు రోజు 'అరఫా' దినంగా భావిస్తారు. ఇది అల్లాహ్ ప్రేమ పొందడానికి అత్యంత శ్రేష్ఠమైన దినం. నరకం నుంచి విముక్తి కోరుతూ ఆ రోజు ఉపవాసం ఉండటం ద్వారా చిన్నచిన్న పాపాలు కూడా క్షమించబడతాయని ముస్లింల విశ్వాసం. ఇదే రోజున చనిపోయిన తమ పెద్దల్ని స్మరించుకుంటూ పెద్దల పండుగ నిర్వహించుకుంటారు. అంతేకాదు ప్రతి ముస్లిం తన జీవితంలో ఒక్కసారైనా పవిత్ర మక్కా యాత్ర చేయాలన్నది మత విధి. అది ఈ పర్వదినం నాడే చేయడం జరుగుతుంది.

ఈ పండుగలోనే హజ్‌యాత్ర...
ఇస్లాం మతంలోని ఐదు మూల స్తంభాల్లో హజ్ యాత్ర ఒకటి. ఈ పర్వదినం ప్రాముఖ్యత, హజ్ యాత్రతో మొదలవుతుంది. ఇస్లాం క్యాలెండరులో చివరి నెల 'జిల్‌హిజ్'. ఈ నెల 9వ రోజున హజ్ యాత్ర ప్రారంభమవుతుంది. ఈ యాత్రలో భాగంగా మక్కా, మదీన క్షేత్రాలను దర్శించుకుంటారు. మక్కాలోని కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణలు, ఆధ్యాత్మిక శుద్ధికి సంకేతం. ఇది కేవలం ఓ యాత్ర మాత్రమే కాదు –ఇది ఆత్మాన్వేషణకు ఆరంభమైన సాధన. తనలోని స్వార్థాన్ని వదిలి, మానవతా మార్గంలో పయనించాలనే సంకల్పంతో చేసే యాత్ర ఇది. ఆ మరుసటి రోజునే బక్రీద్ జరుపుకుంటారు.

ఖుర్బానీ ఎవరు, ఎలా చేయాలి

బక్రీద్ పండుగలో ఖుర్బానీ అత్యంత పవిత్రమైన ఆచారం. దానిని ధనంతో కాదు, మనసుతో చేసే త్యాగమే నిజమైన అర్పణ. ఖుర్బానీ ఇచ్చిన పొట్టేలు మాంసం మూడు భాగాలుగా విభజించి పేదలు, బంధువులు, మూడో భాగాన్ని తామే తీసుకోవాలి. చనిపోయిన వారి పేరుతో ఖుర్బానీ చేయాలంటే ఆ మాంసం పూర్తిగా ఇతరులకే పంచాలి. ఇది కేవలం మాంసం పంచడం కాదు, మానవతా భావన పంచడంగా భావిస్తారు. 52 తులాల వెండి లేదా 7.5 తులాల బంగారం కలిగిన ముస్లింలు విధిగా ఖుర్బానీ చేయాలి.

నిరుపమానమైన త్యాగానికి ప్రతీక– ఖుర్బానీ...
మక్కా నగరంలో హజరత్ ఇబ్రహీం ప్రవక్తకు ముదిమి వయసులో కలిగిన ముద్దుల పుత్రుడు ఇస్మాయిల్‌ను అల్లాహ్‌కు బలిదానం చేసేందుకు సిద్ధమైన పవిత్ర ఘటనను స్మరిస్తూ బక్రీద్ నిర్వహిస్తారు. చివరికి, అల్లాహ్ ప్రత్యక్షమై, ఇస్మాయిల్ బదులు ఒక పొట్టేలును ఖుర్బానీ చేయాలని ఆదేశించాడు. అప్పటి నుంచి ఈ పండుగను జీవన త్యాగానికి జ్ఞాపకంగా జరుపుకుంటూ వస్తున్నారు.

ఈద్ నమాజ్ ఇలా..



పండుగ రోజున ఫజర్ నమాజ్‌ను తమ వీధిలోని మసీదులోనే విధిగా చదవాలి. పరిశుభ్రంగా, మంచి దుస్తులతో అత్తర్, సుర్మా రాసుకుని దారి పొడవునా 'తక్బీర్' చదువుతూ తమ ప్రాంతంలోని ఈద్గాకు వెళ్లి మాత్రమే సామూహిక నమాజ్ చేయాలి. ఈద్ నమాజ్ అయ్యే వరకు ఏమీ తినరాదు. ఈద్గా వద్దకు వెళ్లి, వచ్చే మార్గాలు వేర్వేరుగా ఉండాలి. ఈద్ నమాజ్ తర్వాతనే ఖుర్బానీ ప్రక్రియ ప్రారంభించాలి. వాటిని స్వీకరించాలి.

– అబ్దుల్ కలీమ్, ముఫ్తీసాబ్

క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

– ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల టౌన్: బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన భద్రతా చర్యలను తీసుకున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే ముస్లిం, ఇతర మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎవరు వ్యాఖ్యానించినా, వదంతులు వ్యాపింపజేసినా వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి వారి సమాచారం తెలిపితే సంబంధిత పోలీస్ అధికారులకు, టోల్ ఫ్రీ నెంబర్లు 112/100 లకు కాల్ చేసి చెప్పాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

వాహనం ఢీ.. వ్యక్తి దుర్మరణం

మేదరమెట్ల: రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో అతను అక్కడికక్కడే దుర్మరణం పాలైన సంఘటన కొరిశపాడు మండలం తిమ్మనపాలెం జాతీయరహదారిపై కుబేర హోటల్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల ఎస్ఐ మహ్మద్ రఫీ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతునికి సుమారు 40 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మంగళగిరి టౌన్: కుమారుడు మృతితో మనస్తాపం చెందిన తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు.. మంగళగిరి పట్టణంలోని కొత్తపేటకు చెందిన గడ్డం విష్ణు (43) లారీ పని చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. ఇంటర్ చదువుతున్న కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి విష్ణు మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు విష్ణు భార్య నిద్రలేచి చూడడంతో ఉరివేసుకున్నట్లు గుర్తించి, చుట్టుపక్కల వారిని లేపి చూడగా అప్పటికే చనిపోయి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్య, కుమార్తె శోకసంద్రంలో మునిగిపోయారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వివాహేతర సంబంధంతోనే మహిళ హత్య

- ఇద్దరు నిందితులు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ మొయిన్



మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్, పక్కన సీఐ శేషగిరిరావు, ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: వివాహేతర సంబంధం నేపథ్యంలోనే మానికల దీపిక అలియాస్ వేటగిరి ప్రమీల (24) ను అదే కాలనీకి చెందిన ఇద్దరు హత్య చేసినట్లు చీరాల డీఎస్పీ మొయిన్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళ హత్యకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శుక్రవారం వివరించారు. ఈ నెల 2వ తేదీన రామన్నపేట పంచాయతీ పరిధిలోని నాగవరపమ్మ దేవస్థానం వద్ద గుర్తు తెలియని మహిళ మృత దేహం గుర్తించారు. అయితే రామన్నపేట పంచాయతీ వినాయకపురానికి చెందిన మానికల దీపిక అలియాస్ వేటగిరి ప్రమీల నెల రోజుల క్రితం అదృశ్యం అయినట్లు ఆమె అత్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో అదే కాలనీకి చెందిన ఈగ వెంకటేశ్వరరావు, సైకం నాగబాబు.. గద్దల గుంటకి చెందిన ఇద్దరు బావ బావమరుదులు. వీరిద్దరే చంపి ఉంటారని కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. వీరిద్దరిని శుక్రవారం అదుపులోకి తీసుకొని విచారించారు. కాగా గుర్తు తెలియని మహిళ విషయం తమకు తెలియదని, తాము దీపికను చంపి గ్రామ శివారులోని తోటలో పూడ్చి పెట్టినట్లు ఒప్పుకున్నారు. మృతురాలి భర్త చనిపోవడంతో వ్యసనాలకు బానిసైన ఆమె అత్త వద్ద ఉంటోంది. ఈ క్రమంలో ఆమె ఇంటి వద్దనే ఉంటున్న ఈగ వెంటేశ్వరరావుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. కొంత కాలానికి వెంకటేశ్వరరావు కొమరిగిరి రాములమ్మని వివాహం చేసుకున్నాడు. అనంతరం అదే కాలనీకి చెందిన సైకం నాగబాబుతో వివాహేతర సంబంధం పెట్టుకుని, వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేసింది. లేదంటే విషయం అందరికీ చెబుతానని బెదిరించడం మొదలు పెట్టింది. దీంతో ఈగ వెంకటేశ్వరరావు, సైకం నాగబాబులు ఆమెను చంపాలని నిర్ణయించుకున్నారు. ఏప్రిల్ 30వ తేదీన దీపికను బైక్ పై ఎక్కించుకొని పందిళ్లపల్లి– తిమ్మసముద్రం రోడ్ వరకు వెళ్లారు. అక్కడ ఆమెతో బీరు తాగించారు. అనంతరం బీరు సీసాతో తలపై కొట్టి.. అపస్మారక స్థితిలోకి వెళ్లగా.. మెడకు చున్నీ చుట్టి చంపివేశారు. శవాన్ని మూట కట్టి బైక్‌పై పెట్టుకొని రామన్నపేట శివారు తోటల్లోకి తీసుకొచ్చి పూడ్చివేసినట్లు నిందితులు అంగీకరించారు. పూడ్చిపెట్టిన శవాన్ని తహసీల్దార్ సమక్షంలో తవ్వి బయటకు తీసి పోస్టుమార్టం చేయించారు. మోటార్ బైక్, దుస్తులు, మృతురాలి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరగా ఛేదించిన చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు, ఎస్‌బీ హెచ్‌సీ అచ్చయ్య, తన్నీరు శ్రీను, పి.నరసింహారావు, ఎస్‌కే బాజీత్, పీసీ బాలచంద్రలను డీఎస్పీ అభినందించారు.

అధికారుల వేధింపుల వల్లే ఆత్మహత్యాయత్నం



ఏసు రత్నంను పరామర్శిస్తున్న కనకారావు

బల్లికురవ: బడుగు బలహీన వర్గాలపై అధికారులు, కూటమి నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు అన్నారు. శుక్రవారం మండలంలోని రామాంజనేయపురం గ్రామానికి చెందిన నాగిపోగు ఏసురత్నం తనకు ఇచ్చిన ఇంటి స్థలంలో కొంత భాగానిన మరొకరికి పట్టా ఇవ్వడం పట్ల, కలెక్టర్, రెవెన్యూ అధికారులకు విన్నవించినా.. సమస్య పరిష్కారం చేయకుండా తాత్సారం చేస్తున్నారనే మనస్థాపంతో గురువారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తొలుత అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతున్న ఏసురత్నాన్ని ఒంగోలులోని వైద్యశాలలో కొమ్మూరి కనకరావు పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, స్థానిక నేతలు ఉన్నారు. అలాగే మాదిగ సంక్షేమ పోరాట సమితి ప్రతినిధులు సుజన్ మాదిగ పరామర్శించారు.

ఎన్ఎంఎంఎస్‌లో కొప్పరపాడు విద్యార్థుల ప్రతిభ

జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం



బొంతు భగత్



పి. లక్ష్మీ అమూల్య



ఎస్‌కే మస్తాన్



పెనుకొండ ఎండీవర్



షేక్ చాందిని



జొన్నా భూమిక

బల్లికురవ:. ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో బల్లికురవ మండలం కొప్పరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కై వసం చేసుకున్నట్లు ఎంఈవో–2 కె. రమేశ్‌బాబు శుక్రవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఈ పరీక్షలకు 15 మంది విద్యార్థులు హాజరు కాగా పది మంది ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిలో బొంతు భగత్ 149 మార్కులతో మొదటి స్థానం, పి.లక్ష్మీ అమూల్య 148 మార్కులతో రెండో స్థానం, ఎస్‌కే మస్తాన్ 147 మార్కులుతో మూడో స్థానం కైవం చేసుకున్నారని తెలిపారు. వీరితోపాటు మరో ఏడుమంది స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్టు ఎంఈవో తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా కొప్పరపాడు పాఠశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, హెచ్‌ఎం పి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపకార వేతనాలకు ఎంపిక

అమర్తలూరు(వేమూరు): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ముగ్గురు విద్యార్థులు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు కనపర్తి నిరీక్షణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు జనవరి నెలలో పరీక్షలు నిర్వహించింది. అధిక మార్కులు సాధించిన వారికి నాలుగేళ్ల స్కాలర్‌షిప్‌లు అందించనుంది. పాఠశాలకు చెందిన విద్యార్థులు పెనుకొండ ఎండీవర్ 128 మార్కులు, షేక్ చాందిని 121 మార్కులు, జొన్నా భూమిక 102 మార్కులు సాధించారు. ఏటా రూ.12,000 చొప్పున ఇంటర్ వరకు అందనున్నాయి. విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్ వినయ్ అభినందించారు.

అందరూ కరోనా జాగ్రత్తలు తీసుకోవాలి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి



మాట్లాడుతున్న డాక్టర్ రమణ, పక్కన డాక్టర్ అనిల్‌కుమార్ తదితరులు

గుంటూరు మెడికల్: కోవిడ్ కేసులు మళ్లీ నమోదవుతున్న దృష్ట్యా గుంటూరు జీజీహెచ్‌కు వస్తున్న రోగులు, వారి సహాయకులు తప్పని సరిగా కోవిడ్ నిబంధనలు పాటించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో మీ కోసం మేము కార్యక్రమంలో భాగంగా ఆయన రోగులు, వారి సహాయకులతో సమావేశమై వారి సమస్యలు ఆలకించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరి ప్రాణాలు రక్షించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది తమ ప్రాణాలు పణంగా పెట్టి వైద్య సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఆస్పత్రిలో వాతావరణం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మాస్క్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరు తరచుగా చేతులు పరిశుభ్రం చేసుకోవాలని, దగ్గు, జలుబు, జ్వరం ఉంటే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. దగ్గు, జ్వరం ఉన్నవారు ఆస్పతిలో తిరగకుండా వార్డులో ఉంచి చికిత్స పొందాలని సూచించారు. మద్యం తాగి ఆస్పత్రికి రావద్దని ఆస్పత్రి ఆవరణంలో సిగరెట్లు తాగి వాతావరణం కలుషితం చేయవద్దని కోరారు. మీ కుటుంబ సభ్యులను మా కుటుంబ సభ్యులుగా భావించి చికిత్స అందిస్తామని, మీరు అభద్రతా భావాన్ని , అపోహలు వదిలి పెట్టలన్నారు. ఏ డాక్టర్, నర్సు తప్పు చేయరని ఆస్పత్రిలో వీడియో కెమెరాలు ఉన్నాయని తెలిపారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. గతంలో కోవిడ్ సయమంలో లక్షలు ఖర్చుపెట్టినా కాపాడలేని వారిని గుంటూరు జీజీహెచ్‌లో ప్రాణాలు పణంగా పెట్టి కాపాడారన్నారు. కోవిడ్ కి సంబంధించి టెస్టులన్నీ ఉచితంగా చేస్తున్నామని, ప్రజలు ఈ వైద్యసేవలను వినియోగించుకోవాలని కోరారు. జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ కుమార్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కోవిడ్ విస్తరిస్తున్న సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు గురించి వివరించారు.

10న జిల్లా సీనియర్ అథ్లెటిక్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సింథటిక్ ట్రాక్‌పైన జిల్లా సీనియర్ అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తామని కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు దాటిన యువతీ యువకులు ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 9వ తేదీన ఏఎన్‌యూలోని ఇండోర్ స్టేడియంలో వయస్సు ధృవీకరణ పత్రంతోపాటు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్టును ఇదే ప్రాంతంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు.

అవగాహనతో మలేరియా కట్టడి చేయవచ్చు



గుంటూరు మెడికల్ : అవగాహనతో మలేరియాను కట్టడి చేయవచ్చని జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం అన్నారు. జాతీయ మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక గుండారావుపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుబ్బరాయణం మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి వ్యాధులు కలుగజేస్తాయన్నారు. దోమలు పెరగకుండా ప్రతి ఒక్కరు తమ చుట్టు పక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి దోమలు పెరగకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా దోమకాటు నుంచి రక్షణ కోసం ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

క్రోసూరు: మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన షేక్ శ్రీనివాసరావు(35)పై కొంతమంది వ్యక్తులు దాడి చేయగా తీవ్ర గాయాలతో గుంటూరు ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ పి.రవిబాబు తెలిపారు. ఈనెల 3వ తేదీ అమరావతి మండలంలోని తురకవారిపాలెం ఇటుకబట్టీలలో పనిచేసుకుంటుండగా మునుగోడు గ్రామానికి చెందిన గోపి అనే వ్యక్తితో గొడవ జరిగింది. అనంతరం సాయంత్రం గోపి, మరి కొందరు కలిసి వచ్చి బయ్యవరంలోని శ్రీనివాసరావు ఇంటి పై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. శ్రీనివాసరావుకు తీవ్రగాయాలు కాగా గుంటూరు ప్రవేటు ఆసుపత్రిలో చేర్పించగా అక్రడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ప్రకృతి వ్యవసాయమే రైతులకు దిక్సూచి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి

నరసరావుపేట రూరల్: రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామాల్లో ముందుకు తీసుకువెళ్లాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తెలిపారు. వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో సమన్వయంతో మూడో రోజు శిక్షణా కార్యక్రమం శనివారం బృందావన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మురళీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులందరూ రసాయనాలు వీడి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అనుబంధ శాఖలు కలిసి కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విభాగం నుంచి పాల్గొన్న రామచంద్రన్ మాట్లాడుతూ రాబోయే కాలంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం చేయడమే శరణ్యమని తెలిపారు. ప్రతి రైతు 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ విధానాన్ని ఆచరించాలని సూచించారు. ఈ విధానం ద్వారా భూమికి అన్ని రకాల సూక్ష్మజీవులు అందుబాటులోకి రావడంతో పాటు భూమి ఉత్పాదక శక్తి పెరుగుతుందన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ 28 మండలాల్లో132 గ్రామాల్లో ప్రతిష్ఠాత్మకంగా ప్రకృతి వ్యవసాయం కొనసాగుతుందని తెలిపారు. ఈ ఏడాది 82,619 ఎకరాల విస్తీర్ణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పీఎండీఎస్ కిట్స్ అందుబాటులో ఉన్నాయరని, రైతులు కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఉద్యాన అధికారి రమణా రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో మిరప పంట సాగు చేస్తే మార్కెట్ ధర కన్నా అధిక ధర లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమరాజు, మండల వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో కూటమి చెలగాటం

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వినోద్‌కుమార్ విమర్శించారు. పదవ తరగతి మూల్యాంకాన్ని లోపభూయిష్టంగా నిర్వహించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నగరంపాలెంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో సీవి రేణుకను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఆటు పాలకులు, అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఎటువంటి ఫీజు లేకుండా కోరిన ప్రతి విద్యార్థి జవాబు పత్రాలను రీవాల్యూయేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. తుది ఫలితాలు వచ్చే వరకు అడ్మిషన్లను కొన్ని రోజుల పాటు నిలిపివేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల విషయంలో జరిగిన తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నేతలు పాల్గొన్నారు.

బంగారం చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

వివరాలు వెల్లడించిన వెస్ట్ డీఎస్పీ

లక్ష్మీపురం: కల్యాణ మండపంలోని గదిలో పెట్టిన బ్యాగ్‌లో 8 సవర్ల బంగారం చోరీ చేసిన వ్యక్తిని అరండల్‌పేట పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ తెలిపిన వివరాలు.. తాడికొండ మండలం, రావెల గ్రామానికి చెందిన ములుపూరి హనుమంతరావు మే 11వ తేదీన అమరావతి రోడ్డులోని కల్యాణ మండపంలో జరుగుతున్న మేనల్లుడు వివాహానికి కుటుంబ సభ్యులతో కలసి వెళ్లాడు. పెళ్లి వేడుక సమయంలో హనుమంతరావు భార్య కల్యాణ మండపం గదిలో 8 సవర్ల బంగారు నెక్లెస్‌తో ఉన్న బ్యాగ్‌ను పెట్టి బయటకు వెళ్లింది. అయితే కొంత సేపటి తరువాత వచ్చి చూడగా బ్యాగ్‌లో బంగారం ఆభరణాలు కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల పరిశీలించి ఈనెల 4వ తేదీన అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వెస్ట్ డీఎస్పీ అరవింద్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా అరండల్‌పేట సీఐ ఆరోగ్య రాజు దర్యాప్తు ప్రారంభించారు. మండపంలోని సీసీ ఫుటేజీను పరిశీలించగా పల్నాడు జిల్లా, దాచేపల్లి గ్రామానికి చెందిన గుంజి గోవింద్‌పై అనుమానం వ్యక్తం చేశారు. నిందితుడు శుక్రవారం రాత్రి బ్రాడీపేట 4వ లైన్‌లో ఉన్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు గోవింద్‌ను అదుపులో తీసుకుని విచారించారు. విచారణలో మండపంలోని బ్యాగ్‌ను అందులోని 8 సవర్ల బంగారు ఆభరణాన్ని చోరీ చేసినట్లు అంగీకరించాడు. చోరీ చేసి బంగారు ఆభరణాన్ని తాకట్టు పెట్టి వచ్చిన నగదుతో కొత్త సెల్‌ఫోన్, అలాగే ద్విచక్రవాహనం ఈఎంఐ చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన డబ్బుతో జల్సాలు చేసినట్లు తెలియజేయడంతో పోలీసులు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాన్ని రికవరీ చేసి స్వాధీనం చేసుకుని గోవింద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రెండు రోజుల్లో కేసును దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేసిన అరండల్‌పేట పోలీస్ స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ అభినందించారు.

పవర్ లిఫ్టింగ్‌లో జిల్లాకు చాంపియన్‌షిప్

ప్రతిభ చూపిన జూనియర్ మెన్ క్రీడాకారులు



క్రీడాకారులతో పసుపులేటి సురేష్, జిమ్ రాజు

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి జూనియర్ మెన్ టీం ఛాంపియన్‌షిప్ సాధించింది. ఒంగోలులోని డాక్టర్ పి.ఆనంద్ స్టేడియంలో 12వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు గత నెల 31 నుంచి ఈ నెల 2 వరకు మూడు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్– బెంచ్ ప్రెస్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ మెన్, ఉమెన్ పోటీలు ప్రతిష్ఠాత్మకంగా జరిగాయి. ఈ పోటీలలో పల్నాడు జిల్లాకు చెందిన 8 మంది క్రీడాకారులు 10 బంగారం , 3 రజత, 2 బ్రొంజ్ పతకాలను మొత్తంగా 15 పతకాలను కైవసం చేసుకొన్నారు. జిల్లా ప్రతిష్టను చాటడమేగాక జిల్లా జూనియర్ మెన్ టీం చాంపియన్‌షిప్ మొదటి స్థానం సాధించింది. సబ్ జూనియర్స్‌లో 47 కేజీల విభాగంలో గురజాలకు చెందిన కె.పల్లవి (సిల్వర్ మెడల్), 66 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన ఎం.వినయ్ వెంకట శివ (సిల్వర్ మెడల్), జూనియర్–సీనియర్ మెన్ విభాగంలో 74 కేజీల విభాగంలో వెన్నా దేవీకి చెందిన శరత్ 2 బంగారు పతకాలు, 74 కేజీ విభాగంలో కంకణాలపల్లికి చెందిన రమేష్ చౌదరి బ్రాంచ్ మెడల్, 83 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన పసుపులేటి వంశీ కృష్ణ 3 బంగారు పతకాలు, ఒక రజిత పతకం, 120 కేజీల విభాగంలో గుడిపూడికి చెందిన లింగిసెట్టి శివ నాగేశ్వర రావు నాలుగు బంగారు పతకాలు, సబ్ జూనియర్ మెన్ బెంచ్ ప్రెస్ విభాగంలో 53 కిలోల విభాగంలో గురజాలకు చెందిన కె కార్తీక్ సిల్వర్ పతకం,74 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన షేక్ మొహిద్దీన్ బంగారు పతకం సాధించారు. శరత్ (వెన్నాదేవీ), పసుపులేటి వంశీకృష్ణ రెండు, మూడవ స్థానాల్లో రాష్ట్రస్థాయిలో జూనియర్ స్ట్రాంగ్ మెన్ టైటిల్ సంపాదించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను పల్నాడు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, అంతర్జాతీయ క్రీడాకారుడైన పసుపులేటి సురేష్, పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ ప్రెసిడెంట్ జిమ్‌రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివ రావు, కత్తి పవన్, మాతంగి రాహుల్ గౌతమ్, జి రమేష్, శాంతయ్య శుక్రవారం క్రీడాకారులను అభినందించారు.

హామీలు నెరవేర్చి.. చేనేత పరిశ్రమను రక్షించండి

ఏపీ చేనేత కార్మిక సంఘం డిమాండ్

సత్తెనపల్లి: ఎన్నికల హామీలు నెరవేర్చి.. చేనేత పరిశ్రమను రక్షించాలని, కార్మికులను ఆకలి చావుల నుంచి కాపాడాలని కూటమి ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి పార్టీలు తాము అధికారంలోకి వస్తే చేనేత పరిశ్రమను సంరక్షిస్తామని, ఉత్పత్తులపై జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ చేస్తామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామంటూ హామీలిచ్చాయని చెప్పారు. కానీ ఇప్పటివరకు వాటిని నెరవేర్చలేదని మండిపడ్డారు. వాటిని నెరవేర్చడంతో పాటు చేనేత కార్మికులకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కామర్తి రాజు, కట్టా శివ దుర్గారావు, డోకుపర్తి రామారావు, వాస గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.